
# చీకట్లో చిరుదీపాలు

పాతకాలపు పడకకుర్చీలో కూర్చుని రామనాధంగారు - అనేకమైన ఆలోచనల్లో కొట్టుమిట్టాడుతూ - పరిసరాల్నే మరచిపోయారు. చిన్నప్పటినుండీ ఆయనలో యెన్నో ఆశయాలూ - ఆవేశాలూ చోటుచేసుకున్నా, ఆచరణలో పెట్టలేని యేదో పిరికితనం - అందుకే కాబోలును నా పిల్లల్ని కూడా నా ఆశయాలకు తగ్గట్లు పెంచలేకపోయాను అనుకుంటారు ఆయన. ఈనాడు కొడుకు సూర్యం చేసిన పని - తన మనసును తొలచివేస్తున్నది. సూర్యం ఒక్కడే కాదు - పవిత్ర భారతదేశంలో యెందరో సూర్యాలు - తప్పని తెలిసీ, మరేదైనా పని చేయగలిగీ అవినీతి పనులకెందుకు ఎగబడతారో అర్థం కావడంలేదాయనకు - కాలని కర్రలనూ, వుడకని పప్పునూ తిట్టుకుంటూ - పొయ్యి వూదుతూ, వుక్కిరిబిక్కిరి అవుతూ కళ్ళు తుడుచుకుంటున్నది పార్వతమ్మ - చక్కని శరీరచ్ఛాయతో, మొహంనిండా రాసుకున్న పసుపు, పావలా కాసంత బొట్టుతో సాక్షాత్తూ పార్వతీదేవిలా వున్న ఆమెకళనేమాత్రం తగ్గించలేకపోతున్నది ఆమె కట్టిన రంగు వెలిసిన నేతచీర. చాలీచాలని జీతంతో - గంపెడు పిల్లలతో - కష్టాలేతప్ప సుఖమంటే యేమిటో ఎరుగని - ఆమెను చూస్తే - రామనాధంగారికి యేదో బాధ కలుగుతూ వుంటుంది. ఆమె యిన్నేళ్ళ జీవితంలోనూ తనను నగలు చేయించమనో, యాత్రలు చేయించమనో యే కోరికా కోరలేదు. సుమారు యిరవై యేళ్ళ క్రితం కోరిన కోరిక ఒక్కటే - ముదురాకు పచ్చ పట్టుచీర కావాలని. సరేనన్నాడే కానీ ఎప్పటికప్పుడు యేదో ఆటంకం-మధ్యతరగతివాడి అవసరాలకు అంతువుండదు-మరి. ఆమెకోరిక కోరికగానే వుండిపోయింది. ఏ విషయమైనా మరచిపోతారేమోగానీ రామనాధంగారు ముదురాకు పచ్చరంగు చీర చూడగానే - ఆలోచనలో పడిపోతున్నారు - తన అశక్తతను తిట్టుకుంటున్నారు. నిన్న ఆ కుర్రాళ్ళు వచ్చి "మాష్టారూ! లాటరీ టిక్కెట్టు కొనండి -" అనగానే సహజంగా తనకు లాటరీల లాంటివంటే యిష్టంవుండదు కాబట్టి "మాకెందుకు బాబూ యిలాంటివి?" అన్నారు - కానీ ఆ కుర్రాళ్ళు అంతటితో వదల్లేదు - సరికదా "అమ్మగారి వొంటికి ముదురాకు పచ్చ పట్టుచీర ఎంతో బాగుంటుంది

"అమృత"



మాష్టారూ - రెండురూపాయలు ఖర్చు పెడితే - అమ్మగారి అదృష్టం బాగుంటే ఆ చీర అవిడే కట్టుకోవచ్చు - మరి అలోచించకండి." అంటూ లాటరీ టిక్కెట్టు యిచ్చి, రెండు రూపాయలూ పట్టుకెళ్ళారు. పోతే పోయింది యీ విధంగానైనా - పార్వతి కోరిక నెరవేరితే - అనుకున్నారాయన.

"ఏమండీ - భోజనానికి లేస్తారా?" అన్న పార్వతమ్మ మాటకు యీ లోకంలోకి వచ్చారు రామనాధంగారు.

"సరేపద వడ్డించు -" అంటూ కాళ్ళు కడుక్కుని వచ్చారాయన - రోజూలా - అబ్బాయిని కూడా రానియ్యవే అనక - గంభీరంగా - ముభావ గా వున్న అయన తీరున చూసి పార్వతమ్మగారూహించుకున్నారు - సూర్యం పై యీాయనకేదో కోపం వచ్చిందని.

"అబ్బాయి సూర్యం యింకా రానే లేదండీ - పుదయమనగా వెళ్ళాడు - తిండీ తిప్పలు లేకుండా. ఎక్కడున్నాడో యేమిటో?"

"మరేం ఫర్వాలేదులే - వాడు అడ్డమైన గడ్డీ కరిచి డబ్బు సంపాదిస్తున్నాడట - హోటల్లో హాయిగా తినే వుంటాడు - నీవూ భోజనం చేసెయ్" కోపంగా అన్నారు రామనాధంగారు.

"వాడికెక్కడైనా వుద్యోగం వేయించరాదుటండీ - ఖాళీగా వుండి అల్లరి చిల్లరగా తిరుగుతున్నాడు -" అన్న పార్వతమ్మ మాటలకు సమాధానంగా "పిచ్చి పార్వతీ! యీ రోజుల్లో

వుద్యోగమంటే మాటలా, అందు లోనూ - పెద్దకులాల వాళ్ళు అనిపించు కున్న పాపానికి - మనమిలా బాధపడ వలసిందే - నేను మాత్రం ప్రయత్నాలు చేయడంలేదని యెలా అనుకుంటు న్నావు? ఉత్తినే రోడ్డుమీద తిరగడ మెందుకురా - వుద్యోగం దొరికేదాకా నాలుగు ట్యూషన్లు చెప్పుకోరా అంటే - నామోషీ అంటాడు వాడు. యేదో కాస్త పెట్టుబడి పెట్టి, చిన్న షాపు లాంటిది పెట్టుకోరా అంటే - యింత చదువూ చదివి కొట్లో కూర్చోమంటావా అంటాడు - మరి నేనేం చెయ్యను? వేలకు వేలు లంచాలివ్వందే వుద్యోగాలు దొర కవు. ఆ లంచమైనా - ఎవరికివ్వాలో - ఎవరిద్వారా యివ్వాలో - మనలాంటి వాళ్ళకు తెలీని కిటుకులు. వాడు సంపా దించి మనకు పెట్టలేదని కాదు గానీ - అల్లరిగా తిరుగుతున్నాడే అని నా బాధ - యివ్వాళ వాడి గురించి నే విన్నవన్నీ - తలుచుకుంటే - అసహ్యం వేస్తున్నది." నెమ్మదిగానే అన్నా బాధంతా స్పష్ట మవుతున్నది అయన కంఠంలో.

"అంత చేయరాని పనులు వాడేం చేస్తున్నాడండీ." అని అడగబోయిన పార్వతమ్మగారు - వాకిట్లోకి వచ్చిన సూర్యాన్ని చూచి ఆగిపోయారు.

అంతవరకూ అణిచిపెట్టుకున్న కోపాన్నీ, ఆవేశాన్నీ మరి నిగ్రహించు కోలేని రామనాథంగారు - యిక వుండ లేకపోయారు-

"సూర్యం - నీకిదేం బుద్ధిపుట్టిందిరా? తిండికిలేదా? గుడ్డకులేదా? సినిమాహాల్లో - బ్లాకులో టిక్కెట్లు అమ్మడం - లాడ్జీ లకు అమ్మాయిలను చేరవేసే 'బ్రోకర్' పని చెయ్యడం - నీకు సిగ్గులేదట్రా - నిప్పులాంటి మన కుటుంబానికి మచ్చ తేవడమేనా నీ వుద్దేశ్యం?" కోపంతో అయన కంఠం వణికిపోతున్నది.

ఎంత తీవ్రంగా తండ్రి అడిగారో అంత తీవ్రంగానూ జవాబిచ్చాడు సూర్యం - "నేనొక్కణ్ణే కాదు - నా లాంటివాళ్ళు చాలామంది యిలాంటి పనులే చేస్తున్నారు. ఉద్యోగాల్లో వున్న వాళ్ళు కూడా చేస్తున్నారు."

"ఎందుకనిరా?"

"ఎందుకా - చిన్నప్పటినుంచీ చదువు చదువని చంపేసి, కాలేజీలకు పంపి స్తారు. కాలేజి చదువంటే అదోసరదాగా గడిచిపోయింది. సినిమాలూ, హోటళ్ళూ అలవాటయ్యాయి. చదువయ్యాక రెండేళ్ళు గడిచినా మాకు వుద్యోగాలు లేవు. ఇంట్లో తిండికీ, గుడ్డకీ మీపై ఆధారపడ్డం గాకుండా యిక చిల్లర ఖర్చులకు కూడా మిమ్మల్నడగ్గలమా? అడిగితే మాత్రం మీరూరుకుంటారా? - ఉద్యోగాలున్న వాళ్ళంటారా? - రోజు రోజుకూ పెరిగే నిత్యావసరవస్తువుల ధరలు, మనిషిని ఆకర్షించి, వ్యసనంగా మారిన సినిమాలూ - సరదాలూ కారణం - జీతం చాలకపోతే - మరేదో విధంగా

సైనా సంపాదించకలసిందేగదా! - కొందరు లంచాలు మేస్తే - కొందరు జేబులుకొడితే - కొందరిలాంటి పనులు చేస్తుంటారు -ఇది దేశమంతటా జరుగుతున్నదే నాన్నగారూ! - కేవలం నేనొక్కణ్ణే యిలాంటి పనులు చేస్తున్నానని బాధపడుతున్నారంటే - అది మీ అమాయకత్వమేనండీ -!" నిర్భయంగా, నిర్మొహమాటంగా - చెబుతున్న సూర్యం వేపు అలాగే చూస్తుండిపోయారు రామనాథంగారు.

"మరి ట్యూషన్లు చెప్పమంటే-షాపు పెట్టమంటే వొప్పుకోవేమిరా?"

"ఎన్ని ట్యూషన్లు చెప్పినా, నెలకు వందరూపాయలు వస్తాయంటారా నాన్నగారూ - పైపెచ్చు - ప్రైవేట్లు చెప్పే వాళ్ళంటే నౌకర్ల కంటే హీనం - మనలో చాలామందికి. ఇక - షాపులో కూర్చోమంటారా? - నిలకడగా అలా గంటల తరబడి కూర్చునే వోపికాలేదు - వ్యాపారంలో నెగ్గుకువచ్చే తెలివి తేటలూ లేవు."

కొడుకుతో వాదించడానికి మరివోపిక లేకపోయింది ఆయనకు. త్వరగా వాడికేదో మార్గాన ఒక వుద్యోగం సంపాయిస్తే తప్ప - వాడు మరి దారిలోకి రాడు అనుకున్నారాయన.

"చూడు బాబూ! - ఏదో అవస్థలు పడి నీకుద్యోగం వేయిస్తాను కానీ - ఆ లాడ్జీల వ్యవహారం మాత్రం మానేయ్. నీకూ అక్కా చెల్లెళ్ళున్నారు - ఏదో కడుపుకు జరక్క, ఆ వృత్తిలోకి దిగిన ఆ పిల్లలను - మనలాంటి చదువుకున్న వాళ్ళు ప్రోత్సహించడం హర్షించతగ్గ విషయంకాదు. తండ్రిగా నీవు నన్నే మాత్రం గౌరవించినా - యీ విషయంలో నా మాట మన్నించు"-అంటున్న తండ్రి మాటలకు అడ్డువస్తూ అన్నాడు సూర్యం-"అలాగే కానీ నాన్నగారూ! - నేను మానేసినా, నాలాంటివాళ్ళు వేలకొద్దీ వున్నారు. అది వాళ్ళ తప్పుకాదు. ఇలాంటి చీకటి వ్యాపారాన్ని పరోక్షంగా ప్రోత్సహిస్తున్న ప్రభుత్వ యంత్రాంగానిది - డిగ్రీ కాగితాలే తప్ప తమ జీవనానికి యే విధంగానూ పనికిరాని విద్యావిధానానిది - వుద్యోగాలు తప్ప మరేకష్టమూ చేయడం చేతకాని వాజమ్మలుగా తయారై, అలవాట్లకు బానిసలై - రోజు రోజుకూ మారుతున్న నాగరికతతో పోటీపడలేక - పెరిగిపోతున్న ధరలనరికట్టలేని ప్రభుత్వాన్ని ఎదిరించలేక - యిలాంటి పనులన్నీ చేస్తున్నారు. అంతేకాదు - మన బ్రతుకు తెరువు కోసం - నీతిగా న్యాయంగా యే చిన్న పనైనా చేసుకుని జీవించడానికి-మనవి పాశ్చాత్యదేశాలు కావు. వారి మనస్తత్వాలూ కావు. ముఖ్యంగా మన లాంటి మధ్యతరగతి కుటుంబాలలో - లేని పోని ఆడంబరాలు, అంతస్థుకు మించిన ఆచారాలూ - భేషజాలూ -

మనల్ని తెగించి యేపనీ చెయ్యనీయవు. పైతరగతివాడే చిన్న పనిచేసినా అది హాబీ అవుతుంది. చిట్టచివరి తరగతిలో వాడేనాడూ – పొట్టకోసం యే పనైనా చేయడానికి సిద్ధంగా వుంటాడు. ఇక అన్నివిధాలా చెడిపోయింది, మన మధ్య తరగతివాళ్ళే నాన్నగారూ! నిన్న మీరు లాటరీ టిక్కెట్టు కొన్నారే – అదీ యింతే – వాళ్ళూ నా లాంటివాళ్ళే–"

"ఆ .... అంటే?" ఆశ్చర్యంగా ప్రశ్నించారు రామనాథంగారు.

"లౌక్యం తెలియని మీకివన్నీ త్వరగా అర్థంకావు నాన్నగారూ! – వాళ్ళు తెచ్చిన ఆ పట్టుచీరలు – బట్టల కొట్లో – తెస్తారు – యేదో కొంత సొమ్ము వాళ్ళకిచ్చేవొప్పందంమీద అందరికీ టిక్కెట్లమ్మేశాక – నామమాత్రంగా లాటరీ వేస్తారు. అదెలాగూ ఆ బట్టల కొట్టువాడికే వచ్చేస్తుంది. మిగిలిన డబ్బంతా – వీళ్ళు పంచుకుని – ఖర్చు పెట్టుకుంటారు."

రామనాథంగారి బుర్ర వేడెక్కిపోయింది – విద్యావంతులైనవాళ్ళు – కాబోయే దేశాధినేతలు – వీళ్ళలో – యిన్ని మోసాలా? – అక్రమాలా? – తనకంటె సూర్యం యెన్నోరెట్లు యెదిగిపోయాడనిపించిందాయనకు.

సూర్యానికి తెలివి తేటలున్నాయి. పట్టుదల వుంది. లోకజ్ఞానం వుంది. దాంతోపాటు ఆవేశమూ, కుర్రకారు కుండవలసిన పౌరుషమూ వున్నాయ్.

కానీ అతను చేస్తున్న పనులు యే మాత్రం మెచ్చుకోతగ్గవికావు. ఇంత తెలివైనవాడూ తప్పని తెలిసీ యివన్నీ చేస్తున్నాడంటే కారణం – ఆయనకు అర్థకాలేదు. జీవితంలో ఎందుకూ కొరగాని చదువును నేర్పే విద్యావిధానమా? తన పెంపకమా లేక యే చిన్న పనైనా ధైర్యంగా చెయ్యనివ్వని – కృత్రిమ వాతావరణం కల్పించిన సంఘానిదా? – అని ఆలోచిస్తున్న రామనాథంగారికి సూర్యం ఎప్పుడు వెళ్ళిపోయాడో తెలీ లేదు.


బరువెక్కినహృదయంతో మంచంపై చేరబడ్డారాయన.

సాయంత్రం రోజూ యింట్లోంచి బయలుదేరి – కాస్సేపు గోపాలంతో బాతాఖానీ కొట్టి, అతని కొట్లో సోడా తాగి, అక్కడి నుంచి పార్కు కెళ్ళడం ఆయన కలవాటు.

"ఏమిటోయ్ గోపాలం! మొహం పెట్రొమాక్సులైటులా వెలిగిపోతోంది– ఏమిటి సంగతి" అని అడిగిన మాష్టారికి "అవునండీ – వచ్చే బుధవారమే సీతకూ, నాకూ పెళ్ళండి –" అని కాస్త సిగ్గుపడుతూ చెప్పాడు.

"వెరీ గుడ్ – చల్లగా నూరేళ్ళు వర్థిల్లండి –" అని దీవించి, కాస్సేపు పేపరు తిరగేసి, గోపాలం యిచ్చిన సోడాతాగి, బయల్దేరారు.

కలియుగ రామాయణం




పేపరులో - మరేం విశేషాలు కనిపించలేదు. ఏవో ప్రమాదాలూ, చావులూ తప్పించి - ఎక్కడో ఎవరో పట్టభద్రులు దొంగతనం చేస్తూ పట్టుబడ్డారనీ, మరోచోట దొంగ సర్టిఫికేట్లతో డాక్టర్లుగా చలామణి అయ్యారనీ - అన్నీ యిలాంటి వార్తలే. ఇక రాబోయే ఎన్నిక గురించి - పార్టీలు మారడం - మాసిన చొక్కా విప్పి, మరోటి ధరించడంలా అతి మామూలు విషయమైంది నాయకులకు. నిన్నటిదాకా పొగిడిన వ్యక్తినే పార్టీ మారగానే తెగడ్డం - యింతవరకూ జరిగిన 'మంచి' అంటూ యేదైనావుంటే అది తమ కారణంగానే ననీ - ఆత్మస్తుతీ, పరనిందా చేస్తూ యిచ్చిన వుపన్యాసాల సారాంశాలు, వ్యక్తిభూషణ - దేశంగురించీ, ప్రజల బాగోగుల్ని గురించి కాక - కేవలం తమ జయాపజయాలే ధ్యేయంగా - విద్యార్థులు రాజకీయాలకు దూరంగా వుండాలని వుపన్యాసాలు దంచేస్తూ, తీరా ఎన్నికల సమయానికి వాళ్ళను సమిధలుగా వాడుకోవడం, ఆవేశపరులూ, అమాయకులూ అయిన వాళ్ళు తమలో తాము కొట్టుకుచస్తుంటే - నాయకులంతా యేకమైపోవడం - యిలాంటివన్నీ గుర్తుకు వచ్చాయి రామనాథంగారికి—

అవిద్యావంతులూ, అమాయకులూ అయి మూర్ఖంగా గొర్రెదాటుగా ఓట్లు నమ్ముకునే ప్రజలది తప్పా? లేక — స్వార్థపరులూ, అవకాశవాదులైన నాయకుల తప్పా? అన్న ఆలోచనలో పడ్డారు

రామనాధంగారు. పార్కుదగ్గరికి రాగానే గేట్లోనే యెదురైంది లీల "వచ్చారా బాబాయ్‌గారూ—" అంటూ.

"రా - తల్లీ. అలా కూర్చుందాం" అని ఒక సిమెంటు బల్లవైపు దారి తీశారు. లీలతో పరిచయం అతి విచిత్రమైన పరిస్థితుల్లో అయింది రామనాధంగారికి - ఆ సంగతే యిప్పుడు గుర్తుకు వచ్చి నవ్వుకున్నారు -

"ఏమిటో మీలో మీరే నవ్వుకుంటున్నారు?" అన్న లీల మాటలు వినిపించుకోకుండానే ఆలోచనలో తేలిపోయారాయన.

"ఆనాడు. అసుర సంధ్యవేళ — వూరికి దూరంగా వున్న బంధువుల యింటికి వెళ్ళివస్తున్నాడు తను. ఆఖరి బస్సుకు టైమవుతోంటే గబగబా నడుస్తున్నాడు — బస్‌స్టాపులో ఎవరెవరో చాలమంది వున్నట్లే వున్నారు — నవ్వులూ, కేరింతలూ, గోలా వినబడుతున్నాయి—ఇంతలో గబగబా ఒకమ్మాయి—పరుగు పరుగున తన దగ్గరకు వచ్చి "వచ్చావా బాబాయ్ — నీ కోసమే చూస్తున్నా" నంటూ ఆప్యాయంగా చేయి పట్టుకుంది. ఎవరో అపరిచిత యింత ఆత్మీయంగా మాట్లాడ్డం తనకు విచిత్రంగా తోచినా—యిందులో యేదో అంతరార్థం వుంటుందని వూహించిన తను—మరేం మాట్లాడక ఆమె తోటే వెళ్ళాడు. బస్సుస్టాపులో వున్న వాళ్ళు — మాట్లాడుకుంటూ దూరంగా వెళ్ళిపోయాక ఆ అమ్మాయి చెప్పింది, వెక్కి వెక్కి యేడుస్తూ—తనూ, పక్షవాతంతో మంచానపున్న తల్లీ యీ దరిదాపుల్లోనే వుంటామనీ—తల్లి మందు కోసం చీకట్లో వచ్చిన తనను ఆ కుర్రవాళ్ళు వెళ్ళనీక అడ్డుపెట్టేసి యేదేదో, వాగుతున్నారనీ—వాళ్ళనుంచి తప్పించుకోడానికే తనిలా ప్రవర్తించిందనీ—

తనకెంతో జాలివేసింది ఆ అమ్మాయంటే. యింటిదాకా దిగబెట్టి వచ్చాడు. ఆ అమ్మాయి లీల ఏదో కంపెనీలో టైపిస్టుగా పనిచేస్తున్నది — ఏనాడో తల్లి—భర్తను వదిలేసి—ప్రియుడితో లేచి వచ్చిందని — లీల జీవితాన్ని బలి తీసుకుంది సంఘం—ఎక్కడికి వెళ్ళినా అవమానం—చెయ్యని నేరానికి శిక్షగా-పెళ్ళి కాకపోవడం—అందంగా -ఆకర్షణీయంగా వుండి, తప్పనిసరిగా వుద్యోగం చేయవలసి రావడం — నలుగురి దృష్టీ ఆమెపైనే — ఎందుకో గానీ— లీలతో పరిచయమయ్యాక ఆమె అంటే అదో విధమైన వాత్సల్యం కల్గింది రామనాధంగారికి. అప్పుడప్పుడు పార్కు దగ్గర ఆమెను కలుసుకోవడం — యింటికి వెళ్ళి తల్లిని పరామర్శించడం ఆయనకు దినచర్యలో ఒక భాగమైంది.

"బాబాయ్‌గారూ! కంపెనీలో వుద్యోగం మానేయాలనిపిస్తోందండీ—" అన్న లీల మాటలకు ఆయన "యేమైందమ్మా?" అనడిగారు.

"మా మానేజరు ఆగడాలు రోజు రోజుకూ మితిమీరిపోతున్నాయండీ— మగదిక్కు లేని, యే రక్షణా లేని నన్ను నీచంగా వూహిస్తున్నట్లున్నాడు ఆయన. ఇక నేనక్కడ పనిచేయడం అసాధ్య మని తోస్తున్నది—" అంది లీల.

"చూడమ్మా యీ రోజుల్లో తొందర పడి వున్న వుద్యోగాన్ని మానెయ్యడం యేమంత మంచిపని కాదు. మరెక్కడైనా ప్రయత్నించి, వుద్యోగం తప్పక దొరుకుతుందన్న నమ్మకం వుంటేనే వున్నదాన్ని వదిలేసే విషయం ఆలోచించాలి —" అన్నారు రామనాథం గారు.

"నిజమే—లీలకు మగదక్షత లేదు-తల్లి చూస్తే జబ్బుమనిషి—అవిడకూ సంఘంలోవున్న స్థానం అంతంత మాత్రమే — అందులోనూ ప్రైవేటు కంపెనీయేమో — అతను లీలను గురించి తక్కువగా అంచనావేసి — యేవేవో ఆశలు పెట్టుకొని వుంటాడు-ఇలాంటి ఘరానా వ్యక్తులు యేం తప్పు చేసినా నిందించని కుళ్ళుసంఘం — ఒక ఆడపిల్ల యేదైనా తప్పుచేస్తే— అందుకు దోహదం చేసిన కారణాలేమిటో — పరిస్థితులేమిటో తెలుసుకోకుండా — ఆమెపై రాళ్ళు రువ్వుతుంది. పిచ్చికుక్కలా వెంటాడి తరిమి కొడుతుంది — లీలకు మరెక్కడైనా వుద్యోగ ప్రయత్నం చెయ్యాలి...." అనుకున్నారాయన.

లీల నింటివరకు దిగబెట్టేసి — అలా సినిమాహాలు వైపు వెళ్ళారు — కొత్తగా విడుదల అయిన పిక్చరేమో-వూళ్ళోని జనమంతా దాదాపు అక్కడే వున్నట్లున్నారు. ఏదో కుర్రకారంటే మొదటిరోజే సినిమా చూసెయ్యాలని వస్తారు కానీ — ఆడవాళ్ళు — మరీ చంటిపిల్లల తల్లులు — సిటీ బస్సుల్లో సర్కస్ చేస్తూ — ఒకచేత్తో పిల్లనూ, మరోచేత్తో పాలసీసాలు, పాతగుడ్డల సంచీతో పిల్లలు వుక్కిరిబిక్కిరి అవుతుంటే — రాకపోతేనేం — ఇది మరీ వ్యసనంగా పరిణమిస్తోంది కడుపునిండా తిండికి నోచుకోని వాళ్ళు కూడా — సినిమా అంటే తయారే మరి!—

అక్కడా రద్దీలో గొడవలే .... హిప్పీల్లా, జుత్తులూ, వదులు వదులుగా వున్న పెద్ద పెద్ద బొమ్మలున్న బట్టలూ-చూస్తేనే అసహ్యం కల్గించేలావున్న విద్యార్థులనబడే వాళ్ళు .... ఆడవారి వైపు చూస్తూ కేకలు .... యేవేవో కూతలు .... అసభ్యమైన అరుపులు.

నిజంగా వీళ్ళు చదువుకుంటున్న వాళ్ళేనా?

సినిమాహాలు దగ్గరేకాదు .... సిటీ బస్సుల్లోనే కాదు....

ఎక్కడపడితే అక్కడ .... ఆడపిల్లలను వేధించడం వీళ్ళకు సరదా. స్త్రీని గౌరవించమనీ, అనవసరంగా యితరులను బాధపెట్టవద్దనీ - యెప్పుడూ చదుకోలేదా వీళ్ళు?

వీళ్ళ బాధపడలేక ఎంతమంది అమ్మా యిలు చదువు మానేస్తున్నారో! .... మహిళలెంతో పురోగమస్తున్నారనీ, చదువుల్లోనేమి, వుద్యోగాల్లోనేమి పురుషులతో సమానంగా వున్నారని చెప్పుకుని సంతోషించడమేగానీ .... ఆడది ఒంటరిగా జీవించేంతటి, రాత్రిపూట ఒక్కతే దారిలో నడిచేటంతటి ధైర్య మేది? రక్షణ యేది?

కొంతమంది ఆడపిల్లలు కూడా మరీ బరితెగించి పోతున్నారు. సినీతారల్లా మగవాళ్ళను రెచ్చగొట్టేలా అలంకరణా వెకిలిగా మాటలూ, నవ్వులూ....యేదో ప్రగతిని సాధిస్తున్నామనుకుంటూ మన నాగరికతా, సాంప్రదాయాలను వదిలేసి- ఎబ్బెట్టుగా తయారవడం .... విచ్చల విడిగా తిరగడం .... యివన్నీ చూస్తే యేదో బాధ అనిపించింది ఆయనకు....

ఎక్కడుంది లోపం? .... క్రమ శిక్షణా, కనీసపు మానవతా విలువల్ని బోధించని విద్యావిధానంలోనా!.... నాగరీకుల మయ్యామని.... విపరీతపు పోకడలు పొయ్యే యువతరానిదా? అన్న ప్రశ్న మెదలసాగింది రామనాధం గారిలో.


టికెట్లయిపోయాయి కాబోలు .... బుకింగ్ మూసేశారు .... ఇంతలో మొదలైంది .... చీకటి బజారు .... రెండురూపాయల టిక్కెట్టు నాలుగు రూపాయలకైనా కొనడానికి సిద్ధమయ్యే పిచ్చిజనం .... ఆఖరికి త్రాగుడులాంటి వ్యసనమే అయింది సినిమా అంటే ప్రజలకు.

రాత్రి దాదాపు యేడు గంటల ప్రాంతంలో యిల్లు చేరిన రామనాధం గారికి వుత్తరం తెచ్చియిచ్చింది పార్వతమ్మ.

పెద్దబ్బాయి మురళి దగ్గరే వుండి చదువుకుంటున్న రెండో కూతురు జయ వ్రాసిన వుత్తరమది.

నాన్నగారికి నమస్కృతులు....

ఇటీవల అమ్మ వ్రాసిన వుత్తరం అందింది. మీరందరూ కులాసా అని తెలిసి సంతోషమైనా అందులో అమ్మ వ్రాసిన విషయాలు మాత్రం నాకు నచ్చలేదు. నా పెళ్ళిగురించి మీరెందుకంత దిగులు పడుతున్నారో నాకర్థంకావడం లేదు. ఈ కాలంలో ఎంతోమంది అవివాహితలుగా వుండిపోతున్నారు. చదువుకుని, వుద్యోగాలు చేస్తూ, ఆర్థిక స్వాతంత్ర్యాన్ని కలిగివున్నపుడు — వివాహం కాకపోయినా నష్టమేమీ లేదని నా వుద్దేశ్యం....వివాహం జీవితానికి అవసరమే....కానీ అదే జీవితాశయం కారాదు....తిండీ, బట్టా యిచ్చి చదువులు చెప్పించడమే కష్టంగావున్న యీ రోజుల్లో....వేలకువేలు కట్నాలు యిచ్చి పెళ్ళి చేయగల స్తోమత ఎందరికుంటుంది? ఆడపిల్లను కన్న నేరానికి తండ్రి అప్పులపాలవడం అన్నది....




మన వ్యవస్థ యేర్పరచిన నియమమే.... కానీ యీవేళ నేను యీ సంఘాన్నీ, వ్యవస్థనూ యెదిరించ దలచుకున్నాను. మీరు ఇల్లమ్మి, నిలువనీడ లేకుండా అవస్థపడుతుంటే.... నేను అత్త వారింటికి వెళ్ళి, సుఖంగా బ్రతకలేను. నన్నూ మీ కొడుకుల్లో ఒకరిగా భావించండి. పూర్వం అక్కయ్యల సంగతంటే అది వేరు. ఆ రోజుల్లో ఆడపిల్లల చదువు కింత ఆదరణా వుండేదికాదు. అవసరాన్ని గుర్తించినవారూ అరుదు. బొత్తిగా ఆర్థిక స్వాతంత్ర్యం లేని వారికి వివాహం అంటూ చేసి, వారికో సామాజిక రక్షణను కల్పించవలసిన అవసరం యెంతైనా వుండేది. కానీ యీనాడలాకాదు. మేమూ మగపిల్లలతో సమానంగా చదువుకుంటున్నాము. చిన్నదో పెద్దదో వుద్యోగం దొరక్కపోదు. ఆర్థికంగా మా కాళ్ళపై మేము నిలబడగల్గిన స్థితికి వచ్చాం....కనుక నా నిర్ణయాన్ని మీకు నిర్భయంగా తెలియజేస్తున్నాను. మిమ్మల్ని ఎదిరించినట్లు గానీ, అప్రదిష్టపాలు చేయదలచినట్లు గానీ తలంచకండి. ప్రస్తుతం నా వివాహ ప్రసక్తి మానండి. ఎప్పుడో....ఎవరైనా సరే....అతి సామాన్యుడైనా సరే...నేను తెచ్చే కట్నకానుకల గురించి కాక.... నన్ను నన్నుగా కోరుకున్న వ్యక్తినే నేను వివాహమాడ దలచుకున్నాను. ఎంతకాలమైనా వేచి చూస్తాను....అలా ఎన్నటికీ జరక్కపోయినా నేను బాధ పడను. మీకు కళంకం తెచ్చే పరిస్థితు

లెన్నటికీ కల్పించను....అని ప్రమాణం చేస్తూ ముగిస్తున్నాను. అమ్మకూ, మీకూ మనస్సు నొప్పిస్తే క్షమార్హురాలిని.

జయ.

రామనాధంగారు వుత్తరం చదవగానే దిగ్భ్రాంతి చెందారు....నిన్నగాక మొన్నటి ముగ్ధ-ఏమీ తెలీనిదానిలా అమాయకంగా కన్పించే జయలో ఎన్ని ఆలోచనలు? ఎంత చక్కని భావాలు?.... తన మనసులో వుద్దేశ్యాలు ఎంత క్లుప్తంగా, చక్కగా తెలియబరిచింది.... అనుకుంటున్నారు గానీ, పార్వతమ్మగారి తల్లిమనసు మాత్రం జయ భావాల్తో యేకీభవించలేకపోయింది.

పుట్టినప్పటినుంచీ తన కూతుళ్ళ కెప్పుడు పెళ్ళిచేసి వొకింటివాళ్ళను చేద్దామా....అన్న తపనే గల మనదేశపు స్త్రీల ప్రతినిధి పార్వతమ్మ - వివాహమే జీవితానికి అలంబన అన్న భావం ఆమెలో అణువణువునా వ్యాపించివుంది. కానీ భర్త యేమీ మాట్లాడకపోవడం చూచి నిరుత్సాహంతో .... నిట్టూర్చింది ఆమె.

మరుసటి రోజునుంచీ అకస్మాత్తుగా జ్వరం రావడంతో వారంరోజులు మరి యిల్లు కదలలేకపోయారు రామనాధంగారు....ఆ మధ్యనే అవుతుందన్న గోపాలం పెళ్ళి ఆగిపోయిందనీ, పెళ్ళికూతురు సీత....సినిమాల్లో చేరాలన్న ఆశతో....అదెవరిదెంటో వెళ్ళిపోయిందనీ తెలిసిన రామనాధంగారి మనస్సు కుమిలిపోయింది. వెన్నలాంటి గోపాలం మనసెంత బాధపడిందో....మరి! అయినా .... చిన్నప్పటినుంచీ....తన భర్త గోపాలమే అనుకుంటున్న సీత - యింకెవరి ఆకర్షణలోనో....అతన్ని మరచి వెళ్ళిందంటే....ఆశ్చర్యమన్పించింది ఆయనకు.

జ్వరంతో వున్నన్నాళ్ళూ....సూర్యం తనకు చేసిన సేవలు చూసి....అతనిలో ఎప్పుడూ కనబడే కాఠిన్యపు ముసుగులో నవనీతంలాంటి మనసున్నదనీ.... తండ్రంటే భయం లేకపోయినా.... గౌరవం వుందనీ గ్రహించి....సంతృప్తులయ్యారు.

పథ్యమదీ తిన్నాక....సుమారు వారం రోజుల తర్వాత వీధిమొహం చూసిన రామనాధంగారు లీలను చూచి చాలకాలమైందని ఆమె యింటికి వెళ్ళారు.

"రండి బాబాయ్...." అంటూ ఆహ్వానించిన లీల మొహం చిన్నబోయింది. దైన్యంగా వున్న ఆమె తీరు చూస్తే-యేదో జరగరానిదే జరిగి వుంటుందనిపించింది.

"ఏమిటమ్మా లీలా అలా వున్నావు?" అన్న ఆయన ప్రశ్నకు బదులుగా ఆమె రోదించడం ప్రారంభించింది.

"ఉద్యోగానికి తిలోదకాలిచ్చేశాను బాబాయ్!....తప్పనిసరి అయిపోయింది. ఇక....యీ కుట్టుపనే నాకు జీవనాధారం

మరెక్కడైనా వుద్యోగం దొరికే వరకూ...." అన్న లీల మాటతో అనునయిస్తూ అన్నారు...."మరేం ఫర్వా లేదు....బాధపడకమ్మా! త్వరలో ఎక్కడైనా వుద్యోగం దొరక్కపోదు...." అన్నారేగానీ....వుద్యోగం దొరికే ఆశ మాత్రం ఆయనలో అణుమాత్రం లేదు. ఏమీ చేయలేని అశక్తత....యేదో సహాయపడాలనే తపన మాత్రం వున్నాయి ఆయనలో,

లీల పరిస్థితి గురించి ఆలోచిస్తూ పరధ్యానంగా నడుస్తున్న రామనాధంగారికి "నమస్కారం మాష్టారూ!" అన్న మాటలు వినిపించి యీ ప్రపంచంలోకి వచ్చారు "ఎవరూ" అంటూ తేరిపార చూశారాయన.

అజానుబాహువూ, చక్కని విగ్రహపుష్టి, హుందాగావున్న వేషధారణా.... ఎవరో పోల్చుకోలేకపోయారు.

"మరచిపోయారా మాష్టారూ! నేనండీ రాంబాబుని.... ఛైర్మన్‌గారి అబ్బాయిని...."

"ఆ.... నీవా రాంబాబూ....ఎంత వాడవయ్యావు...." అంటూ ఆనందంగా అతని చెయ్యి పట్టుకున్నారాప్యాయంగా.

"రండి అలా కూర్చుని మాట్లాడుకుందాం" అంటూ ప్రక్కనే వున్న హోటల్లోకి దారితీసి-సర్వరుకు టిఫిన్‌కు అర్డరిచ్చాడు రాంబాబు.

"ఇంతకూ నీవిప్పుడేం చేస్తున్నట్లు?- నాన్నగారు కులాసాయేనా?" అన్న రామనాధంగారి మాటలకు....రాంబాబు

"నాన్నగారు చనిపోయి యేడాది దాటిందండీ.... నేనేం చేస్తున్నానో.... మీరే ఒకసారి మావూరువచ్చి స్వయంగా చూడాలి మాష్టారూ....ఎన్నోసార్లనుకున్నాను మిమ్మల్ని కలవాలని. కానీ యిన్నాళ్ళకు కుదిరింది...." అంటూ తన విజిటింగ్ కార్డు యిచ్చాడు. సి. హెచ్. రాంబాబు, ఎమ్. బి. బి. యస్. అన్న ఆ కార్డు చూడగానే మాష్టారు మనసు పులకించిపోయింది ఆనందంతో.

"వెరీగుడ్....మొత్తానికి డాక్టరువయ్యావన్నమాట...తప్పకుండా వస్తాను మీవూరు త్వలోనే...."అన్న రామనాథంగారితో.... "అర్జెంటుగా మరో పనుంది మాష్టారూ! త్వరగా వెళ్ళిపోవాలి.... మీరు మాత్రం మా వూరు రావడం మరచిపోకండేం....వస్తాను. సెలవ్...." అని రాంబాబు .... హోటల్ బిల్లు చెల్లించి వెళ్ళిపోయాడు.

రామనాధంగారి మనసులో మళ్ళీ ఆలోచనలు.... రాంబాబు హైస్కూలు చదువంతా దాదాపు తనవద్దే చదువుకున్నాడు....తెలివైనవాడే కాదు. పట్టుదల కలవాడు కూడ....తానెన్నోసార్లనుకునేవాడు లక్ష్మీ సరస్వతులు ఒకచోట కూడివుండడం....చాల అరుదని

రాంబాబును చూస్తే....చక్కని వుపన్యా సాలిచ్చేవాడు స్కూల్లో....

ఒకసారి 'మన విద్యావిధానం' అన్న అంశంపై అతను చెప్పిన వాక్యాలు తానెన్నటికీ మరచిపోలేదు. "కేవలం గుమాస్తాలుగా, బడిపంతుళ్ళుగా తయారుచేయడానికే పనికివస్తుంది నేటి మన విద్యావిధానం. చక్కని క్రమ శిక్షణాయుతమైన, జీవితంలో వుపయోగ పడగల....నైతిక విలువలకు విలువ నిచ్చే విద్య కావాలి కానీ, విద్య అంటే కేవలం వ్రాత, చదువుకాదు. మన జీవి తాన్ని సన్మార్గంలోకి మళ్ళించగల జ్ఞానం విద్య. చదువు పూర్తికాగానే డిగ్రీ చేత బట్టుకుని వుద్యోగాలకోసం కాళ్ళరిగేలా తిరగడం కాక—మన జీవితాన్ని స్వతం త్రంగా మలచుకోడానికి వుపయోగపడే వృత్తి విద్యా, సాంకేతిక పరిజ్ఞానమూ కావాలి మనకు. ఎంతోమంది నాయకులూ, మేధావులూ కలిసి — విద్యావిధానాన్ని మారుస్తామంటూ — పదకొండు తర గతుల స్కూలు చదువును పదేళ్ళు చేశారు. నాలుగేళ్ళ కాలేజి చదువును ఐదేళ్ళు చేశారు. పి.యు.సి. పెట్టారు. మళ్ళీ తీసేశారు. ఇది కాదు నిజంగా వాళ్ళు చేయవలసిన సంస్కరణ. ప్రతి విద్యార్థీ బడి వదలి వెళ్ళేటప్పటికి యేదో తన అభిరుచికి తగ్గ వృత్తివిద్యలో ప్రావీణ్యం సంపాయించాలి. కేవలం వుద్యోగం కోసమే యెదురుచూడక— తన జీవికను గడుపుకోగల నేర్పరితనం సంపాదించాలి. ఈనాటి యీ విద్యా విధానం మారేదాకా దేశం ప్రగతిని సాధించలేదు ...." ఇలా సాగేది అతని వుపన్యాసం. మేమంతా నవ్వుకునేవాళ్ళం ....'రాజకీయాల్లో మునిగి తేలుతున్న చలపతినాయుడి కొడుకు యింకెలాంటి కబుర్లు చెబుతాడు?' అని.

తప్పక రాంబాబు యింటికి ఒక్కసారి వెళ్ళి తీరాలని నిశ్చయించుకున్నారు రామనాధంగారు.

ఇంటికి వెళ్ళగానే "పార్వతీ! యీవేళ రాంబాబు కలిశాడు బజార్లో- ఎంత దర్జాగా వున్నాడనీ — అయినా నన్ను మాత్రం మరచిపోలేదులే" అని మహా సంతోషంగా చెబుతున్న ఆయన మాటలకు అడ్డువస్తూ- "రాంబాబంటే— ఛైర్మన్ గారబ్బాయేనా? మనం మాధవ వరంలో వున్నప్పుడు మనింటికి వచ్చే వాడు కుర్రాడు?" అనడిగారు పార్వతమ్మగారు.

"అవును-అతనే- నన్ను ప్రస్తుతం తానుంటున్న వూరు శ్రీరాంపురం రమ్మని మరీ మరీ చెప్పాడు" అంటూ భార్య తెచ్చిన కాఫీ అందుకున్నారు.

"అన్నట్లు సరోజ వచ్చిందండీ- యిద్దరు పిల్లలూ ఎంత బాగా ముద్దొ స్తున్నారో! యిందాకే వచ్చింది మామయ్యను చూడాలంటూ- యిప్పుడే




వెళ్ళిపోయిందిసాయంత్రం వస్తానంటూ" అన్నది పార్వతమ్మ.

సరోజ పక్కింటి వారి పెద్దమ్మాయి-పెళ్లై ఐదేళ్ళయింది. అత్తవారింట్లో యేదో గొడవలనీ-భర్త తాగుబోతనీ చెప్పుకునేవారు తరచు. మామయ్య అంటూ రామనాథంగారితో యెన్నో కబుర్లు చెబుతుండేది పెళ్ళయ్యేదాకా. అదేమో కానీ పెళ్ళి అయ్యాక ఆమె పుట్టింటికి రావడం యిదే ప్రథమం.

సాయంత్రం ఐదు గంటల ప్రాంతంలో సరోజ వచ్చింది. అత్త వారింట్లో తగవుల్లో చిక్కిపోయి, నీరసంగా, నిరుత్సాహంగా వుంటుందని వేసిన ఆయన అంచనా తారుమారే అయింది. చక్కగా, ఆరోగ్యంగా, ఆనందంగా కనబడిందామె.

"బాగున్నారా మామయ్యా!" అంటూ నవ్వుతూ పలకరించింది.

ఆయననుంచి జవాబేమీ రాక పోవడంతో-

"ఏమిటి మామయ్యా అలా చూస్తూ వుండిపోయారు-మీరు నాగురించి విన్న దానికీ, చూస్తున్నదానికీ యింత తేడా వున్నదనేనా?" అని అడిగింది.

"అవునమ్మా— నీ భర్త నిన్ను సరిగా చూడరనీ-ఏవో గొడవలనీ చెప్పేవారు కదా! అన్నీ అబద్ధాలేనా అమ్మా?"

"అన్నీ నిజాలే మామయ్యా-ఒకటి మాత్రం అబద్ధం. నేను పూర్వకాలపు ఆడవాళ్ళలా-తాగివచ్చి కొట్టినా, తిట్టినా పిల్లలకూ నాకూ తిండిలేక మాడ్చినా-పతియే ప్రత్యక్ష దైవమనీ, మీ పాదాల

చెంత యింత చోటిమ్మని ప్రార్థిస్తానని, లేకపోతే అందరూ వూహించినట్లు— కష్టాలకు వోర్చుకోలేక ఆత్మహత్య చేసుకుంటాననీ — అనుకున్న వాళ్ళదే అబద్ధం-పెళ్లైన నాటినుండీ-కట్నాలూ, కానుకలూ యివ్వలేదని గొడవపెట్టే వారు. అయినా, అత్తగారూ-పుట్టింటి వాళ్ళ శక్తేమిటో తెలిసిన నేను మౌనంగా అన్నీ సహించేదాన్ని— కానీ- ఆయన త్రాగడం, యింటికి వచ్చి నన్నూ, పిల్లల్నీ కొట్టడం ప్రారంభించారు. మంచిమాటలతో చెప్పాను. బెదిరించాను. ఆడదానివి — అణిగిమణిగి పడి వుండా లన్నారు. చెప్పుకింద తేలులా వుండా లన్నారు. నేనూ మనిషిననీ నాకూ ఒక వ్యక్తిత్వం వుందనీ గ్రహించలేక పోయారు. జన్మనిచ్చిన తండ్రి బాధ్యత వహించకపోయినా తల్లిగా వాళ్ళను వృద్ధిలోకి తేవలసిన బాధ్యత నాకు తప్ప దని నా చదువుకు తగ్గ వుద్యోగాన్ని సంపాదించుకున్నాను-అది వాళ్ళ కిష్టం లేక నానా మాటలూ అన్నారు. ఇంట్లో నుంచి వెళ్ళిపొమ్మన్నారు. అటువంటి నరకంలో వుడడంకన్న చెట్టుక్రింద వుండడమే నయమని తోచింది నాకు. పిల్లలతో యివతలికి వచ్చేశాను. నా పిల్లల్ని చక్కగా చదివించి, చక్కని పౌరులుగా తయారుచేస్తాను. ఆడవారికి కనీసపు గౌరవాన్నిచ్చే వ్యక్తులుగా తీర్చి దిద్దుతాను. అందరు ఆడవాళ్ళలా సంసారం సాగిస్తూ,హాయిగా, గౌరవంగా బ్రతకాలని నాకూ వుంది మామయ్యా! కానీ-నా కా అదృష్టంలేదు. భర్తతో దెబ్బలు తిన్నన్నాళ్ళు నాపై సానుభూతి కురిపిస్తూ—మొసలి కన్నీళ్ళు కార్చిన సాటివారే నేడు నా ధైర్యాన్నీ, తెగింపునీ నిందిస్తున్నారు. నా వెనుకనే హేళన చేస్తున్నారు. అయినా నేను భయపడ్డం లేదు. నా పిల్లల శ్రేయస్సు కోసం — అన్నిటినీ భరిస్తాను మామయ్యా! అన్నీ అర్థం చేసుకోగలరనే మీతో యివన్నీ చెప్పాను." అంటున్న సరోజ నేత్రాలు సజల పూరితాలయ్యాయి. గొంతు బొంగురుపోయింది.


రెండు రోజుల తర్వాత రాంబాబు వుంటున్న శ్రీరాంపురంలో దిగారు రామనాధంగారు.

రాంబాబు పేరు చెప్పగానే- ఒకతను మర్యాదగా పలకరించి రాంబాబు యిల్లు చూపెట్టాడు.

"రండి—రండి మాస్టారూ — పదండి గదిలో కూర్చోండి, నేనిప్పుడే వస్తాను." అంటున్న రాంబాబు వైపు ప్రేమగా చూశారు రామనాధంగారు.

ఫలహారాలవీ అయ్యాక—రాంబాబు మాస్టారిని తీసుకునివెళ్ళి యిల్లంతా చూపాడు. చిన్నదే అయినా ఆధునికంగా అన్ని సౌకర్యాలతో వుంది.

ఒక ప్రక్క ఉచిత వైద్యశాల అన్న బోర్డు, మరోవైపు కొంతమంది ఆడ



పిల్లలు కుట్టుపనులు చేస్తున్నారు—అటు వైపున ఒక గదిలో ఐదారు టైపుమిషన్లు-కుర్చీలువున్నయ్.

"ఇవన్నీ ఎవరు చేస్తున్నట్లు?" అన్నట్లు ప్రశ్నార్థకంగా చూశారు మాష్టారు.

"నాన్నగారు కూడబెట్టిన సొమ్ము యీ విధంగా వినియోగంచేస్తున్నాను మాష్టారూ!—చదువుకోడానికి అవకాశం లేని, మరే జీవనాధారమూలేని—అసహాయులకు వుచితంగా—జీవితానికి పనికి వచ్చే యీ పనులను నేర్పడం-కనీసపు వైద్యసౌకర్యాలకు నోచుకోని అభాగ్యులకు వుచితంగా వైద్యంచేయడం నా ధ్యేయంగా పెట్టుకున్నాను మాష్టారూ! త్వరలోనే యిద్దరు ముగ్గురు చదువుకున్న వాళ్ళను యీ పనులకు నియమించాలనుకున్నాను. ఇవన్నీ చూచి మీరు సంతోషిస్తారనే మిమ్మల్ని రమ్మన్నాను మాష్టారూ—" అన్న రాంబాబు మాటలకు మాష్టారు అతని తలపై చేయివేసి నిమురుతూ- "నిజంగా నీలాంటి శిష్యుడున్నందుకు నాకెంతో గర్వంగా వుంది రాంబాబూ!- నీవు అనుకున్నవన్నీ సాధించగలవనే నమ్మకం నాకుంది-" అన్నారు-ఆనందంతో వుక్కిరిబిక్కిరై. సాయంత్రందాకా రాంబాబుతో చేగడిపారు మాష్టారు-వెళ్ళబోయేముందు పిచ్చాపాటీ మాట్లాడుతూ అన్నారు—"మరి నీవు గృహస్థు వెప్పుడవుతావు మరి?" అని.

సంఘంలో సరియైన స్థానం లేని-నిరుపేద—నా ఆశయాలను ఆచరణలో పెట్టగల— యే అభాగ్య యువతినో

చేసుకోవాలని అనుకుంటున్నాను మాష్టారూ! నేనేదో నిస్వార్థపరుణ్ణి- త్యాగశీలినీ అని కాదు. అలాంటి వాళ్ళకు వివాహమవడం అసాధ్యం కనుక. అన్నీ చక్కగా వున్న అమ్మాయిలను చేసుకోడానికి ఎందరో సిద్ధంగా వుంటారు- కనీసం—ఒక అభాగినికైనా – మంచి జీవితాన్ని ప్రసాదించదలచుకున్నాను మాష్టారూ!"

చప్పున లీల మెదిలింది మాష్టారి మనసులో.

"మంచిది—నీ నిర్ణయం చాలా బాగుంది. దేవుడు నిన్ను ఆశీర్వదిస్తాడు రాంబాబూ" అని సెలవు తీసుకున్నారు రామనాధంగారు. ఇంటికి వెళ్తూ దారిలో చాలా రోజుల తర్వాత గోపాలం బడ్డీ తెరవబడ్డం చూసి, ఆగారు మాష్టారు.

"నమస్కారం-రండి-రండి-నిన్ననే వచ్చాను సీతను తీసుకుని" సంబరంగా చెబుతున్న గోపాలంవైపు ఆశ్చర్యంగా చూశారు.

"తీసుకు వెళ్ళిన రామారావు—బెజవాడలో వదిలేసి వెళ్ళిపోయాడు సీతను. మా వాళ్ళెవరో నాకు వ్రాస్తే వెళ్ళి తీసుకువచ్చాను – దగ్గరవాళ్ళం మేమే కాదంటే సీతగతి యేమవుతుంది మీరే చెప్పండి-" అన్న గోపాలం హృదయ వైశాల్యం లెక్కకట్టలేని దనిపించింది. దాయనకు. ఇంతకాలంగా తన్ను పీడిస్తున్న సమస్యలెన్నిటికో పరిష్కారం లభించినట్లయింది. తన తరంవాళ్ళు మనసులో ఎన్నో ఆశయాలున్నా ఆచరణలో పెట్టలేని బలహీనులయ్యారు కానీ యీ తరానికి ప్రతినిధులు రాంబాబు, గోపాలం, జయ, సరోజలే కాదు. తన పరిచయంలోనే యింతమంది వుంటే— ఇక దేశంలో యిలాంటి ఆశయ సాధకులెందరో మరి!

ఒక్క రాంబాబు
ఒక్క గోపాలం
ఒక్క సరోజ

ఒకే-జయ వీరంతా వేలకొద్దీ విజృంభించాలి—సంఘంలో చైతన్యం కలిగించాలి. తర తరాలుగా బూజు పట్టిన భావాలకు తిలోదకాలిచ్చి, నవ సమాజ నిర్మాణం చేయాలి – వీరంతా చీకట్లో చిరుదీపాలు.

ఇవన్నీ కోటిదీపాలై—ఆ దీపాల వెలుతురులో – ఎంతోమంది జీవితాల్లో వెలుతురు నింపాలి. అందరి హృదయాల్లో చల్లని వెన్నెల గుమ్మరించాలి- అనుకుంటూ హాయిగా కమ్మని నిద్రలోకి జారిపోయారు రామనాధంగారు.